ఈనాడు అన్నమయ్య

ఒకటీ.. రెండు.. ఉగ్గబట్టుకునుండు!

- మరుగు లేదు.. శౌచాలయాలు లేవు
- పట్టణాల్లో కనీస అవసరాలకు తిప్పలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో మరుగుదొడ్ల కొరత ప్రజలకు ఇబ్బందిగా మారింది. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన మదనపల్లెలో జనాభా కూడా పెరిగింది. బయట నుంచి వచ్చే ప్రజలు తాకిడి ఎక్కువగా ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఒకటి, రెండూ ఏదొచ్చినా ఉగ్గబట్టుకుని ఉండాల్సిందే. మరుగు లేక, మరుగుదొడ్లు కానరాక ముప్పుతిప్పలు పడుతున్నారు. మహిళల ఎదురవుతున్న కష్టం వర్ణనాతీతం.



పుంగనూరు పురపాలకసంఘంలోని ఎన్టీఆర్ కూడలి

ఇంకెన్నాళ్లీ తిప్పలు

దేశాన్ని ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) చేయాలని ఎన్డీయే ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ తీసుకొచ్చింది. సామూహిక మరుగుదొడ్లు నిర్మించి పట్టణాల్లో వందశాతం ఓడీఎఫ్ అమలు చేయాలని ఆదేశాలిచ్చినా పురపాలక సంఘాల్లో అమలు కావడం లేదు.

ప్రజా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

జిల్లా కేంద్రమైన మదనపల్లెకు వివిధ ప్రాంతాల నుంచి రోజూ వేల సంఖ్యలో ప్రజలు వివిధ రకాల పనుల నిమిత్తం వస్తుంటారు. సోమవారం పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. జనాభాకు తగ్గట్టుగా పట్టణంలో మరుగుదొడ్లు నిర్మించలేదు. ప్రత్యేకించి మహిళలు, విద్యార్థినులు శౌచాలయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ప్రజా మరుగుదొడ్లు ఉన్నా నిర్వహణ లేక కంపుకొడుతున్నాయి.



నిరుపయోగంగా ఉన్న నీరుగట్టువారిపల్లె అమ్మచెరువులో నిర్మించిన మరుగుదొడ్డి

రాయచోటిలో ఉండేది రెండే

ఎనిమిది నెలల క్రితం నాటి జిల్లా కేంద్రం, నేడు డివిజన్ కేంద్రంగా ఉన్న రాయచోటి పురపాలికలో 1.30 లక్షలు జనాభా ఉండగా కేవలం రెండే ప్రజా మరుగుదొడ్లు ఉన్నాయి. పట్టణ జనాభా ప్రకారం మరో అయిదు నిర్మించాల్సి ఉంది. ఉన్న వాటి నిర్వహణ బాగానే ఉన్నా బయటి నుంచి రాకపోకలు సాగించే వారి అవసరాలకు సరిపడా లేవు.

పుంగనూరులో పరుగో పరుగు

పుంగనూరు పురపాలిక జనాభా 60 వేలు కాగా రెండు మరుగుదొడ్లు మాత్రమే నిర్మించారు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో ప్రజల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఇక్కడున్న మరుగుదొడ్లను తొలగించారు. పట్టణంలో మరో ఆరుచోట్ల అవసరం ఉంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

స్వచ్ఛభారత్ మార్గదర్శకాల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 100 మరుగుదొడ్లు ఉండాలి. ఇందులో పురుషులకు 50, మహిళలకు 50 కేటాయించాలి. దీని ప్రకారం మదనపల్లెలో 2 లక్షలు జనాభాకు 200 మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. ఆరు మాత్రమే ఉన్నాయి. మరో ఆరు నిర్మాణానికి నిధులు మంజూరైనా స్థలం కొరత కారణంగా నిర్మాణాలు ప్రారంభం కాలేదు.

కొండ పిండైంది.. బండ బాటైంది



ఈ చిత్రం చూశారా.. ఇక్కడో పెద్ద కొండ ఉండేది.. అది కాస్తా ముక్కలైంది.. అంతా బండే కావడంతో దానిని తొలగించి చక్కటి జాతీయ రహదారిగా మలిచి వాహనాలు దూసుకెళ్లేలా తీర్చిదిద్దారు. గతంలో ఇరుకు దారిలో రాకపోకలు సాగించేవారు. ఇప్పుడీ మార్పును చూసి ఆశ్చర్యపోతున్నారు. కొండ మధ్యలో బండల మధ్య సాగే ఈ దారి మదనపల్లె-కలికిరి మధ్య ఉంది. ఆ చిత్రమే ఇది. - **న్యూస్‌టుడే, కలికిరి**

నిధులు పారాలి.. నదులు బతకాలి

- హద్దులు మీరుతున్న ఆక్రమణలు
- రక్షణ గోడల నిర్మాణమే శ్రేయస్కరం

మదనపల్లె పట్టణం, పీలేరు గ్రామీణ, రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో చెప్పుకోతగ్గ సాగునీటి ప్రాజెక్టులు లేవు. దీంతో రైతులు వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎల్‌నినో నేపథ్యంలో ఈ సమస్య తీవ్రమైంది. పంటలు ఎండిపోతుండటంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. సాగునీటి వనరులు ఒడిసి పట్టాలన్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో నీరు వృథాగా సముద్రం పాలువుతోంది. జిల్లాలో నదులను వినియోగించుకుంటే సమస్యలను అధిగమించవచ్చు.



ఆక్రమణలతో కుంచించుకుపోయిన బాహుదా నది

బాగుకు నోచుకోని బాహుదా

■ మదనపల్లెలో బాహుదా నది ఆక్రమణలతో కుంచించు కుపోయింది. పట్టణంలో ఏకంగా కట్టడాలే నిర్మించగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పొలాలు ముందుకు రావడంతో కాలువ స్వరూపమే మారిపోయింది. ఒకప్పుడు తాగునీటిని అందించిన ఈ నది నేడు మురుగు కూపంగా మారింది. పట్టణంలో ఆక్రమణలను తొలగించి రక్షణ గోడలు నిర్మించాలి.

■ పీలేరులో పింఛ నదిపై 10 వరకు చెక్‌డ్యాంలు నిర్మించగా 2019 వరదల్లో చాలా వరకు దెబ్బతిన్నాయి. గత వైకాపా ప్రభుత్వం మరమ్మతులు పట్టించుకోలేదు. వీటిని తిరిగి నిర్మిస్తే సాగునీటి కొరత తీరడంతో పాటు భూగర్భ జలాలు పెంపొందుతాయి.

■ రాయచోటిలో మాండవ్య నదిలో ఏకంగా షెడ్లు వేసి వివిధ రకాల గోదాములు నిర్వహిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా కోసం ఎక్కడపడితే అక్కడ నదిలోకి అడ్డదారులు నిర్మించి రాత్రింబవళ్లు ఇసుక తరలిస్తున్నారు.

అభివృద్ధి శూన్యం

నదులు ఆక్రమణకు గురికాకుండా రక్షణ గోడలు నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో ఇది చాలా ముఖ్యం. పట్టణాలు విస్తరిస్తున్న నేపథ్యంలో నదులు చాలా వరకు ఆక్రమణకు గురౌతున్నాయి. ఇలాంటివి జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిం చబడుతున్న నదీ పరివాహక అభివృద్ధి పథకం కింద అభివృద్ధి చేస్తే భావితరాలు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

నదులు..

జిల్లాలో పాపఘ్ని, బాహుదా, పింఛ, మాండవ్య, గార్గేయ, కుషావతి తదితర నదులు ప్రవహిస్తున్నాయి. ఇవన్నీ వర్షాకాలంలో మాత్రమే ఉధ్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి ఎక్కడా చుక్కనీరు లేక ఎడారులను తలపిస్తున్నాయి.

ప్రాజెక్టులు..

పాపఘ్నిపై గాలివీడు వద్ద వెలిగల్లు జలాశయం నిర్మించారు. జిల్లాలో ఇదే పెద్ద ప్రాజెక్టు. నిమ్మనపల్లెలో బాహుదాపై ప్రాజెక్టు నిర్మించగా హంద్రీనీవా కాలువపై అడవిపల్లి జలాశయం, గాలివీడు మండలంలో కుషావతి, పింఛ నదిపై గార్గేయ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇవన్నీ చిన్న ప్రాజెక్టులే.

మరణంలోనూ వీడని స్నేహబంధం

- ఆటోను ఢీకొన్న కారు
- ఇద్దరు యువకుల దుర్మరణం



రాజేష్



వెంకటేష్ (పాత చిత్రాలు)

ఆ బాల్య స్నేహితులిద్దరిదీ ఒకటే గ్రామం.. తల్లిదండ్రులు కూలిపనులు చేస్తూ వీరిని చదివించారు. ఎక్కడకు వెళ్లినా చెట్టాపట్టాలేసుకుని తిరిగే వారు. తండ్రి మరణంతో డిగ్రీలోనే చదువాపేసి ఒకరు కుటుంబ బాధ్యతల్లో పాలుపంచుకుని పాల ఆటో నడుపుతున్నాడు. మరొకరు చదువు కొనసాగిస్తున్నారు. ఎప్పటిలాగే స్నేహితుడి ఆటో కనబడేసరికి ఎక్కి కూర్చున్నాడు. వీరి స్నేహ బంధాన్ని చూసి ఈ మృత్యువుకు కన్నుకుట్టిందేమో వారిని వెంటాడుతూ కారు రూపంలో కబళించింది. ఆ ఇద్దరి ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపోయాయి. ములకలచెరువు మండలం మలిగివారిపల్లెను జరిగిన విషాదకర ఘటన ఇది. - **న్యూస్‌టుడే, ములకలచెరువు**

ములకలచెరువు మండలం, పెద్దపాళ్యం పంచాయతీ, మలిగివారిపల్లికి చెందిన రమణప్పకు ఇద్దరు కుమారులు.. తండ్రి మరణంతో చిన్న కుమారుడు వెంకటేష్ (20) డిగ్రీ రెండో సంవత్సరంతో చదవాపి ఆటో తోటుకుంటూ, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు రాజేష్ (19) ములకలచెరువులో డిగ్రీ చదువుతున్నాడు. వెంకటేష్ ఆటోలో ములకలచెరువు మండలంలోని పలు గ్రామాల నుంచి పాల క్యాన్లు సేకరించి బి.కొత్తకోట డెయిరీకి తరలించేవాడు.

● ఆదివారం సాయంత్రం వెంకటేష్ తనతో పాటు స్నేహితుడైన రాజేష్‌తో కలిసి ఆటోలో పాల క్యాన్లతో బి.కొత్తకోటకు బయలుదేరాడు. ములకలచెరువు మండలం, పెద్దపాళ్యం సమీపంలోని వంతెనపైకి చేరగానే అనంతపురం నుంచి మదనపల్లెకు వెళ్తున్న కారు వీరి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు అయింది. తీవ్రంగా గాయపడిన వెంకటేష్, రాజేష్‌లను 108 వాహనంలో ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించడంతో మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో మలిగివారిపల్లిలో విషాదం నెలకొంది. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడి కోలుకున్నాడు. ఈసారి మరణం అతన్ని వీడలేదు. రాజేష్ ఒక్కగానొక్క కొడుకు.. అక్కకు వివాహం కావడంతో తానే ఆ కుటుంబానికి ఆసరా. కూలి పనులు చేస్తూనే తమ కుమారుడు ఉన్నత చదువులు చదవాలని ఎంతో ఆశతో కళాశాలకు పంపుతున్నారు. కానీ వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఒక తమకు దిక్కెవరని గుక్కపెట్టి ఏడుస్తున్న తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది.



నుజ్జునుజ్జయిన ఆటో

బాగు చేస్తే దాటిస్తాయ్.. జాగు చేస్తే కాటేస్తాయ్

- వంతెనల తాత్కాలిక సేవలు

అవన్నీ దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనలు.. శిథిలావస్థకు చేరుకున్నా ఏళ్లు గడుస్తున్నా అలాగే సేవలందిస్తున్నాయి.. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. వర్షాకాలంలో ఉధ్ధృతంగా పారే వాగుల, వంకల దెబ్బకు వీటిని దాటేలంటే వాహన చోదకులకు గుండెదడ తప్పడం లేదు. రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. కొత్తవి నిర్మించాలన్న ప్రతిపాదనలు దస్త్రాలకే పరిమితమైంది. పురాతన వంతెనలపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. జిల్లాలో 30 వంతెనలు సురక్షితంగా లేవని రభ శాఖ అధికారులు గుర్తించినా కొత్తవి నిర్మించకపోవడంతో ముప్పు పొంచి ఉంది.

- న్యూస్‌టుడే, మదనపల్లె పట్టణం, పీలేరు, ములకలచెరువు, పుంగనూరు, లక్కిరెడ్డిపల్లె, నిమ్మనపల్లె



వరదొస్తే గల్లంతే

మదనపల్లె మండలం చీకలబైలు నుంచి తిప్పారెడ్డి గారిపల్లెకు వెళ్లే మార్గంలో బాహుదా నదిపై పదేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు సాగించడానికి తాత్కాలికంగా సిమెంటు పైపులు వేసి వంతెన నిర్మించారు. వర్షాలు వస్తే మళ్లీ అది కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

రక్షణ గోడలు కరవు

మదనపల్లె-తిరుపతి మార్గంలో సీటీఎం వద్ద పురాతన వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాహన చోదకులు అజాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రాత్రి సమయంలో ఇది మరింత ప్రమాదకరం.



మట్టితో మరమ్మతులు

లక్కిరెడ్డిపల్లె మండలం ఈడిగపల్లె వద్ద నిర్మించిన వంతెన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ప్రజలు, వాహనాలు రాకపోకలకు అంతరాయం కలుగకుండా మట్టితో తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. భవిష్యత్తులో భారీ వర్షాలు వస్తే మళ్లీ వంతెన కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

● పీలేరు- తలపుల మార్గం గూడరేవుపల్లె వంకపై నిర్మించిన వంతెన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రాకపోకలు సాగించేందుకు మట్టిపోసి తాత్కాలిక మరమ్మతులు చేయించినా వంతెనపై వాహనాలు వెళ్లేందుకు అనువుగా లేదు. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి.



వంతెన మధ్యలో గొయ్యి

నిమ్మనపల్లె నుంచి వాల్మీకిపురానికి వెళ్లే మార్గంలో బాహుదా నదిపై నిర్మించిన కాజ్‌వే ప్రమాదంలో ఉంది. తూములు ఏర్పాటు చేసినా ఒకవైపు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. మధ్యలో ఏర్పడిన గొయ్యిలో బండరాళ్ల వేసి ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. వర్షాలు వస్తే కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.



రూ.20 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలో వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. తంబళ్లపల్లె, మదనపల్లె మండలంలో రెండు వంతెనలకు రూ.20 కోట్లతో అంచనాలు రూపొందించాం. ప్రభుత్వం పరిధిలో దస్త్రం ఉంది. నిధులు మంజూరు కాగానే పనులు చేస్తాం.

- మసూద్ అలీ, ఇన్‌ఛార్జి ఈఈ, రభ శాఖ

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌-2, నారాయణగిరి షెడ్లులో వేచిఉన్నారు. వీరికి 10 గంటల్లో, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది. శ్రీవారిని శనివారం 85,246 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ కానుకలు రూ.4.30 కోట్లు లభించాయి.

సివంగులు.. బరిలో ఫిరంగులు

ఆటలంటే వారికి ప్రాణం.. అందుకే చదువుతో పాటు ప్రాధాన్యం ఇచ్చారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక సమయం కేటాయించుకుని కఠోర శిక్షణ తీసుకున్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను జాతీయ స్థాయి క్రీడాకారులుగా చూడాలని వారి కోసం రోజూ సమయాన్ని వెచ్చిస్తూ మైదానానికి తీసుకెళ్లడం, తీసుకురావడం అలవాటుగా చేసుకున్నారు. బాస్కెట్‌బాల్ కోచ్ నటరాజ్ శిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె విద్య

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా



ఏడాదిగా బాస్కెట్‌బాల్ ఆడుతున్నాను. తల్లిదండ్రులు రెడ్డిశేఖర్, శోభన ఎంతో ప్రోత్సహించారు. కోచ్ శిక్షణతో చిత్తూరు, హైదరాబాదు, మదనపల్లె, సీటీఎంలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటాను. ఇటీవల చిత్తూరులో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ జట్టుకు ఎంపికయ్యా. సెప్టెంబరులో జరిగే పోటీలకు ఎంపికయ్యాను. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం.

- కె.చార్వీ, 8వ తరగతి

వ్యాయామం.. ఆరోగ్యం



- మనస్విని, 9వ తరగతి

ఆటలంటే ఇష్టం.. క్రీడలతో మంచి వ్యాయామంతో పాటు ఆరోగ్యంగా ఉంటాం. అమ్మా నాన్న సోమశేఖర్, కుమారీలకు ఎన్ని పనులున్నా సమయం కేటాయించుకుని మైదానానికి తీసుకొస్తున్నారు. రెండేళ్లుగా బాస్కెట్‌బాల్ ఆడుతున్నాను. చిత్తూరు, సీటీఎంలో జరిగిన ఎస్‌జీఎఫ్, మదనపల్లె, విజయవాడల్లో జరిగిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాను. ఇప్పుడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. చదువుతో పాటు ఆటల్లో రాణించి వ్యాయామోపాధ్యాయురాలు అవుతాను.

రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

చిన్నమండెం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సెప్టెంబరు ఒకటో తేదీ మంగళవారం నిర్వహించనున్నామని డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. జిల్లాలోని 25 మండలాలు, మూడు పురపాలకాల్లోని 1,86,509 పింఛన్లకు.. రూ.80.90 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. స్పౌజ్ పింఛన్లు 189 మంజూరయ్యాయన్నారు. వీటిలో మదనపల్లె మండలానికి 15, పుంగనూరుకు 13, పెద్దమండ్యం, పీటీఎంకు 12 చొప్పున కేటాయించారన్నారు. పీలేరుకు 11, కురబలకోటకు 10, గాలివీడు, సోమల, పుంగనూరు పురపాలకాలకు 9 చొప్పున, సంబేపల్లెకు 8, రామసముద్రం, తంబళ్లపల్లెకు 7, కలికిరి, ములకలచెరువు, రామాపురానికి 6, కలకడ, నిమ్మనపల్లె, రాయచోటి, సదుంకు ఐదేసి చొప్పున వచ్చాయన్నారు. బి.కొత్తకోట, చౌడేపల్లె, గుర్రంకొండ, కేవీపల్లె, రాయచోటి పురపాలకకు నాలుగు చొప్పున, వాల్మీకిపురానికి రెండు, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె, మదనపల్లె పురపాలక సంఘాలకు రెండేసి మంజూరయ్యాయని పేర్కొన్నారు.

పశుగ్రాసానికి పుట్టెడు కష్టాలు

రామసముద్రం, న్యూస్‌టుడే:



రామసముద్రంలో ఎండిపోయిన గడ్డి

పొలంలో ఎండిన ఈ పశుగ్రాసం రామసముద్రం మండలం అరికెల గ్రామంలోనిది. సాగునీటి కోసం వేసిన బోరుబావి ఎండిపోయింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ముఖం చాటేశాయి. మండలంలో సుమారుగా 10 వేలకు పైగానే వ్యవసాయబోర్లున్నాయి. 500 ఎకరాల్లో ఉన్న పశుగ్రాసం ఎండిపోయింది. మండలంలో 12,500 పాడి ఆవులు ఉన్నాయి. రోజుకు ఒక్కో పాడి ఆవుకు 20 కిలోల పచ్చిగడ్డి, ఐదు కిలోల దాణా, 70 లీటర్ల నీరు అవసరం. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, పీలేరు డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో రెండు లక్షల పాడి ఆవులు, 88 వేల గేదెలు, 7.5 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి. జిల్లా అంతా సగానికి పైగా కుటుంబాలు పాడిపైనే జీవనం సాగిస్తున్నాయి. నెలకు 600 టన్నుల గడ్డి, 15 లక్షల కిలోల దాణా అవసరం. లభ్యత సగం కూడా లేదు. శ్రీకాళహస్తి, నెల్లూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఎండు గడ్డిని దిగుమతి చేసుకుంటున్నారు.

● 5 టన్నుల గడ్డి లారీ రూ.70 వేలు వరకు పలుకుతోంది. జిల్లాలో నెలకు ఎండుగడ్డికి రూ.8.5 కోట్లు, దాణాకు రూ.8 కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. ఎల్‌నినోతో పశుపోషణ భారంగా మారింది. నీటి లభ్యత లేదు. ప్రభుత్వం తమకు చేయూత నివ్వాలని పోషకులు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

మదనపల్లె గ్రామీణ: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం తెలిపారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలపై కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచీ అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఆయా మండల, డివిజన్ కేంద్రాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని, జిల్లా కేంద్రానికి వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా సమస్యపై అర్జీలు పంపించేందుకు అవకాశం ఉందన్నారు. అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు 1100 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

దారంతా గుంతలే.. దాటాలంటే గెంతులే!

పీటీఎం మండలం కందూరు జింకలబోర్డు- చెట్లవాండ్లపల్లె మార్గం గుంతలతో వాహన చోదకులకు నరకాన్ని రుచి చూపిస్తోంది. ఈ దారిలోనే కర్ణాటక వైపునకు వెళ్లే వాహనాలన్నీ రాకపోకలు సాగిస్తుంటాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ రహదారి పనులను దక్కించుకున్న పీఎల్ఆర్ సంస్థ కర్ణాటక సరిహద్దు నుంచి చెట్లవాండ్లపల్లె వరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. చెట్లవాండ్లపల్లె నుంచి కందూరు జింకలబోర్డు వరకు వదిలేశారు. దీంతో గుంతల దారిపై గెంతుతూ వెళ్లాల్సి వస్తోంది. - **న్యూస్‌టుడే, పీటీఎం**





విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్న పోలీసు సిబ్బంది

నీట్ పీజీకి 30 మంది గైర్హాజరు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో నీట్ పీజీ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మదనపల్లెలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, కురబలకోట మండలంలోని మిట్స్ డీమ్డ్‌టుబి విశ్వవిద్యాలయంలో ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి పోలీసులు తనిఖీలు చేసి పంపారు. ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లను మూసివేశారు. డీఎస్పీ బుచ్చిరాజు, రూరల్ సీఐ కళా వెంకటరమణ, సీఐ రవినాయక్, ఎస్ఐలు నాగేశ్వర్‌రావు, విష్ణునారాయణ, మధురామచంద్రుడు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో రాయచోటి, మదనపల్లె డివిజన్ కేంద్రాల్లో 747 మంది విద్యార్థులు పరీక్షలు రాయల్సి ఉండగా 717 మంది హాజరయ్యారు. కేంద్రాల వద్ద డ్రోన్లతో పర్యవేక్షించారు.

వరుణ యాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో తితిదే చేపట్టిన కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్య శాంతి హోమాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రాయశ్చిత్త హోమం, అంకురార్పణ చేపట్టారు. సెప్టెంబరు 3వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈ యాగ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కె.ఎస్.ఎస్.అవధాని ఆధ్వర్యంలో ఈ యాగాలు జరుగుతున్నాయి.



వరుణయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేస్తున్న ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కె.ఎస్.ఎస్. అవధాని, రుత్వికులు

భాజపా బలోపేతానికి కలిసి పనిచేయండి



పార్థసారథితో మాట్లాడుతున్న నరేంద్రకుమార్‌రెడ్డి, విష్ణు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామగ్రామాన భాజపా బలోపేతానికి అందరూ కలిసి పని చేయాలని ఆదోని భాజపా శాసనసభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి.. నియోజకవర్గ పార్టీ నాయకులకు సూచించారు. ఆదివారం మదనపల్లెకు ఓ ప్రైవేటు కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన పార్థసారథిని.. జిల్లా భాజపా అధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డితో కలిసి పీలేరు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా ఎలా నడుచుకోవాలి, పార్టీ పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న మేలు, అభివృద్ధిని పల్లెపల్లెకు తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పార్థసారథి నాయకులకు సూచించారు. నాయకులు విష్ణు, శ్రీకాంత్, రమేష్, జయరామిరెడ్డి, ఫరీద్ బాబు, జాకీర్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మపథంలో గణపతి వ్రతం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: స్థానిక ధర్మపథంలోని శ్రీ కార్యసిద్ధి అభయాజనేయస్వామి ఆలయంలో నేటి (సోమవారం) సాయంత్రం ఐదు గంటలకు సంకష్టహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆదివారం తెలిపారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమై తదుపరి నిత్యసేవలు అనంతరం సాయంత్రం సంకష్టహర గణపతి వ్రతం, అనంతరం గణపతి హోమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని భక్తులకు సూచించారు.

పీలేరు.. పురంగా ఇంకెప్పుడు మారు

- కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు
- నిరాశలో మేజర్ పంచాయతీ ప్రజ
- నెరవేరని ఎమ్మెల్యే కిశోర్ హామీ

న్యూస్‌టుడే, పీలేరు

జిల్లాలో జనాభా, ఆదాయం రీత్యా పెద్ద పంచాయతీల్లో ముందువరుసలో ఉన్న పీలేరు పంచాయతీ 'గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అవడం ఇక లేనట్లే.. ఈ మేరకు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ఇటీవల శాసనసభలో చేసిన ప్రకటనతో స్పష్టమైంది.. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి.. పలు సమావేశాల్లో పీలేరును మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.. అధికారులు సైతం మున్సిపాలిటీగా అభివృద్ధి చెందేందుకు ఉన్న నిబంధనల మేరకు వివరాలను సిద్ధంచేసి దస్త్రం మున్సిపల్ శాఖ ఆమెదం కోసం గతేడాది డిసెంబరులో ప్రభుత్వానికి పంపారు.. ప్రభుత్వం జనగణన పూర్తి చేసిన తరవాత ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు.. తీరా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలనే ప్రభుత్వ నిశ్చయంతో నూతన మున్సిపాలిటీ ప్రతిపాదన ముందుకు రాలేదు.



పీలేరు పంచాయతీ కార్యాలయం

ఇవీ ప్రయోజనాలు..

పంచాయతీలో ప్రస్తుతం ఏడాదికి ఒకసారి ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. అదే మున్సిపాలిటీ అయితే ప్రతి ఆరు నెలలకోసారి పన్ను చెల్లించాలి. పంచాయతీలకు తలసరి ఆదాయం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంది. మున్సిపాలిటీకి ప్రత్యేకంగా మున్సిపల్ శాఖ ప్రత్యేక నిధులు ఇవ్వడంతో పాటు బడ్జెట్ కూడా కేటాయిస్తుంది. దీంతోపాటు ఉద్యోగుల సంఖ్యా పెరుగుతుంది. మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్ ఉంటారు. పారిశుద్ధ్య కార్మికులకు మెరుగైన వేతనాలు సహా వారి సంఖ్య పెరుగుతుంది. భూముల విలువలూ పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు అందివస్తాయి. ప్రజల అవసరాల మేరకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేకంగా నిధులు వచ్చే అవకాశం ఉంది. ప్రజలు సైతం పీలేరు మున్సిపాలిటీగా అభివృద్ధి చెందితే రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంటుందని ఆశించారు.

2011 జనాభా లెక్కల ప్రకారం..


అధికారులు గ్రేడ్-2 మున్సిపాలిటీకి 2011 జనాభా లెక్కల ప్రకారం 45 వేలు ఉన్న పంచాయతీలను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనల్లో మేజర్ పంచాయతీగా ఉన్న పీలేరు, బోడుమల్లువారిపల్లె పంచాయతీ పూర్తిగా, ఎర్రగుంటపల్లె పంచాయతీలో నెట్టిబండ, చౌడేశ్వరీనగర్, చేనేతనగర్, కాకులారంపల్లె పంచాయతీలో బందార్లపల్లె, కొత్తపల్లె, కోళ్లఫారం, ఇందిరమ్మ కాలనీలు గూడరేవుపల్లె పంచాయతీలో తిరుపతి రోడ్డు నూనెవిత్తుల కర్మాగారం, కంకర ఫ్యాక్టరీ లేఔట్, దొడ్డిపల్లె పంచాయతీలో దారంవారిపల్లె (కొత్తపేట), ఆకులవారిపల్లె, పీఆర్‌సీ కాలనీ, ఏపీఐఐసీ-లేఔట్‌లు ఉన్నాయి. వీటిలో పీలేరు సర్పంచి హబీబ్‌బాషా, గూడరేవుపల్లె సర్పంచి జగన్మోహన్‌రెడ్డి, ఎర్రగుంటపల్లె సర్పంచి చంద్రారెడ్డి, కాకులారంపల్లె సర్పంచి హరిణి, బోడుమల్లువారిపల్లె సర్పంచి జయలక్ష్మి, దొడ్డిపల్లె సర్పంచి సుబ్బులు నుంచి మున్సిపాలిటీలో విలీనానికి తీర్మానం కాపీలు తీసుకున్నారు. అవసరమైన అన్ని వివరాలు క్రోడీకరించి దస్త్రం రూపొందించి ప్రభుత్వానికి పంపారు.

గత చరిత్ర..

1922లో ఏర్పడిన పీలేరు పంచాయతీకి తొలిపర్యాయం సంకల రెడ్డెప్ప ఏకగ్రీవ సర్పంచిగా పనిచేశారు. ఆపై 1956లో మేజర్ పంచాయతీగా అప్‌గ్రేడ్ అయింది. ప్రారంభంలో పంచాయతీ సర్పంచిగా వార్డు సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకునేవారు. వార్డు సభ్యులకు సర్పంచికి సఖ్యత కుదరనపుడు సర్పంచిపై అవిశ్వాసం ప్రతిపాదించి పదవీచ్యుతుడిని చేసి కొత్త సర్పంచిని సభ్యులు ఎన్నుకునే అవకాశం ఉండేది. 1981 నుంచి జరిగిన ఎన్నికల్లో సర్పంచి, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఒకవేళ వార్డు సభ్యులకు సర్పంచికి కుదరనప్పుడు సర్పంచిపై అవిశ్వాసం పెట్టేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు జనాభాను దృష్టిలో పెట్టుకుని పూర్వపు చిత్తూరు జిల్లాలో మేజరు పంచాయతీలుగా ఉన్న రేణిగుంట, బి.కొత్తకోట, పీలేరు, కుప్పం పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఇందుకు 2012లో నాటి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా అప్పటి సీఎం, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికారులు ఇతర అభివృద్ధి పనులపై దృష్టి పెట్టడంతో మున్సిపాలిటీ ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు.

మంత్రి ప్రకటనతో నిరాశ..

పీలేరు పట్టణంగా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో గుర్తింపు వస్తుందని ఆశించిన ప్రజలు నిరాశకు గురయ్యారు. ఆదాయం, జనాభా రీత్యా పుంగనూరు, బి.కొత్తకోట, కుప్పం కన్నా అన్ని విభాగాల్లో పీలేరు అధికంగా ఉన్నా మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యే విషయంలో వాయిదాలు పడుతూనే ఉన్నాయి. ప్రభుత్వం త్వరలో స్థానిక ఎన్నికలు ప్రత్యేక పద్ధతిలో జరిపేందుకు సన్నద్ధమవుతున్నందున ఇక కొత్త మున్సిపాలిటీలు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదని మంత్రి నారాయణ స్పష్టం చేయడం పీలేరు ప్రజల్లో నిరాశ మిగిల్చింది.



గోపురానికి రంగులు వేస్తూ..

కాణిపాకం.. కాంతులనేకం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 4 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సంబంధిత ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధాన, అనుబంధ ఆలయాలకు రంగులు వేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా రంగవల్లులు వేస్తున్నారు. ప్రధాన కూడళ్ల తదితర ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలంకరణ, ఆర్చిలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు అవసరమైన క్యూలైన్ల నిర్మాణం చేపడుతున్నారు. పనులను పాలకమండలి ఛైర్మన్ వి.మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ పర్యవేక్షిస్తున్నారు.

- న్యూస్‌టుడే, కాణిపాకం

ప్రశాంతంగా ముగిసిన నీట్ పీజీ



హాల్‌టికెట్లు పరిశీలించి లోనికి అనుమతిస్తున్న సిబ్బంది

రాయచోటి, రామాపురం, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ రాయచోటిలో ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల, బిట్స్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో 235 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. శ్రీసాయి కళాశాలలో 135 మందికి.. 127 మంది హాజరయ్యారు. బిట్స్ కళాశాలలో 100 మందికి.. 98 మంది విద్యార్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఉదయం ఆరు గంటలకే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. ఆర్డీవో శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నారాయణరెడ్డి, డీఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. పట్టణంలో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సీఐ ఎం.కృష్ణారెడ్డి జాగ్రత్తలు తీసుకున్నారు. భారీ బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బొప్పరాజుపై విమర్శలు సరికాదు

రాయచోటి, న్యూస్‌టుడే: ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్న ఏపీ ఐకాస అమరావతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుపై.. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నరసింహకుమార్, కె.గోపీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఉద్యోగ సంఘ నాయకులపై విమర్శలు చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. తద్వారా ప్రభుత్వానికి ఉద్యోగుల మధ్య దూరం ఏర్పడుతుందన్నారు. ఉద్యోగుల పక్షాన నిలబడి వారి సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడం సంఘ నాయకుల బాధ్యత అన్నారు. ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారి సమస్యలను ప్రభుత్వం ముందుంచుతున్నారన్నారు. వాటిలో ఎన్ని సమస్యలు పరిష్కరించారు.. ఎన్ని అపరిష్కృతంగా ఉన్నాయి.. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందనే విషయాలను ఉద్యోగులకు తెలియజేయాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. వెంకటేశ్వర్లుపై చేసిన వ్యక్తిగత విమర్శలను ఉద్యోగ సంఘాలు మూకుమ్మడిగా ఖండిస్తున్నాయని, ప్రభుత్వం సామరస్య ధోరణితో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



బి.కొత్తకోటలో నాయకులకు అభివాదం చేస్తున్న శంకర్ యాదవ్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించడానికి ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని తంబళ్లపల్లె తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి శంకర్ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెదేపా ఇన్‌ఛార్జిగా నియమితులై తొలిసారిగా ఆదివారం బి.కొత్తకోటకు వచ్చిన ఆయనకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక బెంగళూరు రోడ్డు నుంచి జ్యోతి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండులో క్రేన్ సాయంతో శంకర్ యాదవ్‌కు భారీ గజమాలను నాయకులు వేశారు. రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ పర్వీన్ తాజ్, పార్టీ నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంటు కన్వీనరు కుడుం శ్రీనివాసులు, మండల నాయకులు నారాయణస్వామిరెడ్డి, బంగారు వెంకట్రమణ, కనకంటి ప్రసాద్, కుమార్, శివ, ప్రకాష్, రాజా, సురేంద్రబాబు, సమీవుల్లా, ఎండీ మస్తాన్, నాయకులు పాల్గొన్నారు. **ములకలచెరువు:** తెదేపాకు కంచుకోటగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేస్తామని శంకర్‌యాదవ్ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో వైకాపాకు తగిన బుద్ధి చెబుతామన్నారు. తెదేపా రాష్ట్ర నాయకులు కట్టా దొరస్వామినాయుడు, మండల తెదేపా కన్వీనర్ సిద్ధ, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పెద్దమండ్యం:** రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటించి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెదేపా బాధ్యుడు శంకర్‌యాదవ్ అన్నారు. తెదేపా మండల పార్టీ కన్వీనర్ జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం ఆయనకు ఘనంగా స్వాగతం లభించింది. ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాసులు, రాజంపేట బీసీ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **కురబలకోట, తంబళ్లపల్లె, ములకలచెరువు:** శంకర్‌యాదవ్‌కు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారిపై మూడు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి తెదేపా జెండా ఆవిష్కరించారు. నాయకులు దొరస్వామినాయుడు, సిద్ధ, సయ్యద్ బాషా, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాయినాథ్, గుత్తికొండ త్యాగరాజు, తదితరులు ఉన్నారు. **పెద్దతిప్పసముద్రం:** శంకర్‌యాదవ్‌కు మండలంలోని కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు.

భవన నిర్మాణాలపై ఇంపాక్ట్

- పనులకు భారీగా రుసుములు
- గత ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు

★ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నగర, పురపాలక సంఘాల పరిధిలో 2,67,278 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.191.04 కోట్ల మేర ఆస్తి పన్ను వసూల వుతుంది. ★ జిల్లాలో మూడు పురపాలికలు ఉండగా మదనపల్లెలో 27,237 అసెస్‌మెంట్లు ఉండగా రూ.27 కోట్లు, పుంగనూరులో 12,993కు రూ.6.37 కోట్లు, రాయచోటి 28,448కి రూ.15.25 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఇంపాక్ట్ రుసుము పేరుతో పన్ను విధించడంతో నిర్మాణదారులకు భారంగా మారింది. నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణాలకు ప్లాన్ అనుమతి పొందే సమయంలో నిర్మాణ ప్రాంతంలో చదరపు అడుగు ప్రకారం రుసుము వసూలు చేస్తున్నారు. దీంతో నగరపాలికలు, పురపాలికల పరిధిలో నిర్మాణాల అనుమతులకే రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

వివిధ రకాల పేర్లతో...

ఇంపాక్ట్ పన్ను, వీఎల్‌టీకి సంబంధించి మార్కెట్ విలువలో 0.05 శాతం కింద లెక్కిస్తే రూ.500 వచ్చిందనుకున్నాం. దీనికి ఏడుసార్లు లెక్కిస్తే రూ.3,500 చెల్లించాల్సి ఉంది. లేబర్ సెస్సు, మొత్తం జాగా విలువలో ఒక శాతం, ట్రీగార్డు రూ.1,500, ఇంకుడు గుంత రూ.3-5వేలు, అభివృద్ధి ఛార్జి, భవన లైసెన్సు రుసుం, కాంపౌండ్ వాల్, యూజర్ ఛార్జీలు ఇలా పలు రకాల రుసుములు విధించి వసూలు చేస్తున్నారు.

అనుమతి సమయంలో బాదుడు..

స్థలంపై రిజిస్ట్రేషన్‌శాఖ నిర్ణయించిన మార్కెట్ విలువపై కార్పొరేషన్‌లో 2 శాతం, పురపాలక పరిధిలో 1 శాతం, పంచాయతీల్లో 0.5 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఇంపాక్ట్ రుసుము ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాల్లోనే అమలు చేస్తున్నారు. మాస్టర్ ప్రణాళికలో భాగంగా 60 అడుగుల నుంచి 150 అడుగుల వరకు ప్రతిపాదిత రోడ్డు, రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులు, బైపాస్ రోడ్డు, రింగ్ రోడ్డు పక్కన నిర్మించే నిర్మాణాలకు వర్తింపజేశారు. ఒక్కో నిర్మాణంపై ప్లాన్ సమయంలోనే రూ.లక్ష నుంచి రూ3.లక్షల వరకు అదనంగా భారం పడుతోంది.

ఇలా ఛార్జీలు..

కన్వర్షన్ ఛార్జీలు చ.మీ.కు రూ.15-20, లేఔట్ ఆమోదానికి హెక్టారుకు రూ.20 వేలు, సైట్ ఆమోదం చ.మీ.కు రూ.15, ఓపెన్ సైట్ ఛార్జీలు మొత్తం విలువలో 14 శాతం, బిల్డింగ్ పర్మిట్ రుసుము రూ.15-80, ఇంధన స్టేషన్లు, వేబ్రిడ్జిలకు చ.మీ.కు రూ.100, ఎగ్జిబిషన్, సర్కస్ తదితరాలకు చ.మీ.కు రూ.15 వరకు విధిస్తున్నారు.

పదివేల టోకెన్లు జారీ

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి తిరుపతిలో శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు శనివారం అర్ధరాత్రి 12:30 గంటలకు 10 వేల సమయ నిర్దేశ ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. అలాగే శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లే భక్తులకు 2 వేల టోకెన్లు జారీ చేశారు. ప్రస్తుతం సెలవులు లేనప్పటికీ తిరుమలకు వెళ్లే వారి సంఖ్య రోజు రోజుకీ విపరీతంగా పెరుగుతోంది.

సహజ జీవనమే ఆరోగ్యానికి శాశ్వత పునాది



మాట్లాడుతున్న మంతెన సత్యనారాయణరాజు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రకృతికి అనుగుణంగా జీవించడం, సహజ ఆహారం తీసుకోవడం, తగినంత విశ్రాంతి, స్వచ్ఛమైన నీరు, గాలిని అలవాటుగా చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డా.మంతెన సత్యనారాయణరాజు తెలిపారు. ఆయుష్, తితిదే ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన ఆరోగ్య పరిరక్షణ అవగాహన కార్యక్రమం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహజ ఆహారం, స్వచ్ఛమైన నీరు, గాలి, తగినంత విశ్రాంతి ఆరోగ్య సంజీవనిలోని నాలుగు ముఖ్య అంశాలని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ముందుగానే శ్రద్ధ వహించి మంచి జీవన అలవాట్లు పాటిస్తే అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో ఆనందరాజు, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, తితిదే ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో ప్రియుడి అరెస్టు

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా నింద్ర మండలం సవరంబాక్కం గ్రామానికి చెందిన అరుణ(45) తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోట సమీపం దొడ్డారెడ్డికుప్పంలో గురువారం రాత్రి హత్యకు గురయ్యారు. మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తిరువళ్లూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. అరుణ భర్త మంజునాథ నాయుడు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వీరి కుమారుడు, కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. అరుణ తల్లిదండ్రులు పెరియపాళ్యం సమీపం వడట్టూరులో ఉంటున్నారు. దీంతో ఆమె అక్కడకు వెళ్లి వస్తుంటుంది. ఇలా వచ్చి వెళ్లే క్రమంలో అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ భారతిరాజాతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. రహస్య ప్రాంతంలో ఇద్దరూ తరచూ కలిసే వారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వడట్టూరులో జరిగిన వివాహ వేడుకలో అరుణ పాల్గొంది. అనంతరం భారతిరాజాతో ద్విచక్ర వాహనంపై దొడ్డారెడ్డికుప్పానికి చేరుకుంది. ఏకాంతంగా గడుపుదామని అరుణ కోరగా భారతిరాజా నిరాకరించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన భారతిరాజా వెంట తీసుకొచ్చిన మోటారు ఆయిల్‌ను ఆమెపై పోసి నిప్పంటించి పారిపోయాడు. అరుణ మృతదేహం పక్కన సెల్‌ఫోన్ లభ్యమైంది. దీని ఆధారంగా భారతిరాజాను పోలీసులు శనివారం రాత్రి పెరియపాళ్యం సమీప పాలేశ్వరంలో అరెస్టు చేశారు. హత్య చేసినట్లు అతను అంగీకరించాడు. అనంతరం కోర్టులో హాజరుపరచి పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు.

మోసం చేశారని ఆర్ఎస్సై, కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

సంబేపల్లె, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌కు అద్దె చెల్లిస్తామని ఒప్పందం చేసుకుని తీసుకెళ్లినవారు.. ఆ తర్వాత ట్రాక్టర్ ఆచూకీ ఇవ్వట్లేదంటూ ఓ వ్యక్తి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని గున్నికుంట్ల గ్రామం జాండిగారిపల్లెకు చెందిన బాబ్జి.. తన ట్రాక్టరును తాడిపత్రి ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన ఆర్ఎస్సై చంద్రహాస్, కానిస్టేబుల్ ప్రతాప్‌కు గత జూన్‌లో అద్దెకు ఇచ్చాడు. వారు దానికి అద్దె చెల్లించకపోవడంతో తనకు అప్పగించాలని కోరినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అసలు తన వాహనాన్ని ఎక్కడ ఉంచారనే విషయాన్నీ చెప్పకుండా మోసం చేశారని అతడు.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బాధితుడి ఫిర్యాదు మేరకు చంద్రహాస్, ప్రతాప్‌పై మోసం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్‌యాదవ్ తెలిపారు.

వివాహానికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: వివాహానికి వెళ్లి వస్తున్న ఓ వ్యక్తిని కారు రూపంలో మృత్యువు కబళించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాలిలా.. సత్యసాయి జిల్లా కదిరికి చెందిన **శ్రీరాములు** (50) కొంతకాలం క్రితం మదనపల్లెలోని కొత్తఇండ్లులో నన్నారి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య నీలమ్మ, కుమార్తెలు మమత, భూమిక ఉన్నారు. ఉదయం సీటీఎం గ్రామంలో వీరి బంధువుల వివాహానికి వెళ్లారు. అనంతరం ఆయన బంధువైన బండ్లపాయి గ్రామానికి చెందిన లక్ష్మిదేవి, శ్రీరాములు కలిసి ద్విచక్రవాహనంపై మదనపల్లెకు వస్తూ తట్టివారిపల్లె వద్ద ఉన్న తిరుపతి రోడ్డులో రాంగ్ రూట్‌లో వచ్చారు. అదే సమయంలో తిరుపతి వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరాములు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడగా తిరుపతికి రెఫర్ చేశారు. రూరల్ ఎస్సై విష్ణు నారాయణ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని వేలు కోసుకున్న భర్త

రామకుప్పం న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాలేదని మనస్తాపంతో బొటనవేలు కోసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... మండల పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన మంజునాథ్.. బల్ల గ్రామానికి చెందిన యువతితో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. కొంతకాలం నుంచి మంజునాథ్ వ్యసనాలకు అలవాటుపడి తరచూ మద్యం తాగేవాడు. చెడు అలవాట్లు మానుకోవాలని భార్య అతన్ని నిలదీసేది. తీరు మార్చుకోవాలంటూ ఆదివారం ఉదయం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను అత్తగారింటికి వెళ్లి తిరిగి ఇంటికి రావాలని ఘర్షణ పడ్డాడు. వ్యసనాలు మానుకోకపోతే తిరిగి రానని భార్య తెగేసి చెప్పడంతో మనస్తాపంతో మంజునాథ్ తన బొటన వేలును కత్తితో కోసి అత్తింట్లో పడేసి వెళ్లిపోయాడు.

బొప్పాయి విత్తనం.. నియంత్రణ లేని వైనం

అధికారిక విక్రయాలు కరవు ✦ నర్సరీలు, ప్రభుత్వం బాధ్యత వహించాలంటున్న రైతులు

న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

జిల్లా పరిధిలోని రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో బొప్పాయి ప్రధాన ఉద్యాన పంట. ఏటా ఈ నియోజకవర్గాల్లో సుమారు 10 నుంచి 15 వేల ఎకరాల్లో ఈ పంట రైతులు సాగు చేస్తున్నారు. అక్టోబరు, నవంబరు నుంచి జనవరి, ఫిబ్రవరి వరకు మొలకలు నాటుతారు. ఈ పంటకు ప్రధాన వనరు విత్తనం. తైవాన్ నుంచి దిగుమతి చేసుకునే రెడ్ లేడీ-786 రకానికి గిరాకీ ఎక్కువ. రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో ఆయా విత్తనాల విక్రయాలు అధికారికంగా జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు, స్థానికంగా ఎవరో ఒక అనధికార వ్యాపారి నుంచి వాటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కొనుగోళ్లకు తగిన రసీదులు ఉండవు. వాటిని కొని నర్సరీల యజమానులకు ఇస్తే.. వారు వాటిని మొలకెత్తించిన తర్వాత రైతులకు ఇస్తారు. అందులో కొన్ని నాసిరకాలు, రెడ్‌లేడీ కాక ఇతర రకాలూ ఉండొచ్చు. పంట కాపు దశకు వచ్చే వరకు తాము సాగు చేసింది ఏ రకమనేది రైతులు తెలుసుకునే పరిస్థితి లేదు.

రూ.10 నుంచి 35కు చేరిన మొలక ధర

.కిలో బొప్పాయి విత్తనాలు రూ.10 లక్షల వరకు పలుకుతున్నాయి. అయితే వాటి అసలు ధర ఎంత ఉంటుంది.. డీలర్లకు, వ్యాపారులకు ఎంత ధరకు ఇస్తారనే విషయాలు గోప్యం. ఎకరానికి రైతులు వెయ్యి నుంచి 1,200 మొలకలు కొనుగోలు చేస్తారు. వీటి ధర గతేడాది వరకు రూ.10 నుంచి 12, 15 వరకు ఉండేది. ఈ ఏడాది ఆ ధర ఏకంగా రూ.35(ఒక మొలక)కు చేరింది. విత్తనం లభించలేదని, డిమాండ్ ఏర్పడిందని వ్యాపారులు మొలక ధరలు అమాంతంగా పెంచేశారు. దీంతో రైతుల పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. ఒక ఎకరా బొప్పాయి సాగుకు దున్నకాలు, ఎరువులు, మందులు కలిపి రూ.1.5 లక్షల ఖర్చవుతుంది. తీరా కోతల సమయానికి ధరల జూదం మొదలవుతోంది. వీటన్నింటిపైనా ప్రభుత్వం, ఉద్యాన, వ్యవసాయశాఖల నియంత్రణ, నిరంతర పర్యవేక్షణ అవసరమని రైతులు చెబుతున్నారు.



బొప్పాయి మొలకలు సిద్ధం చేస్తున్న కూలీలు

చర్యలు చేపడుతున్నాం

విత్తనాల సరఫరా, విక్రయాలు తదితర అంశాలు వ్యవసాయశాఖ పరిధిలో ఉంటాయి. నర్సరీల్లో మొలకెత్తినప్పటి నుంచి రైతులు కొనుగోలు చేయడం, పంట చేతికి వచ్చేవరకు ఉద్యానశాఖ పర్యవేక్షిస్తుంది. విత్తనాల విక్రయంలో కంపెనీ ఉద్యోగులు, ఏజెంట్లు మాత్రమే ఉంటున్నారు. కచ్చితమైన ధరలతో దుకాణాల్లో విక్రయించేలా చర్యలు చేపట్టడానికి కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమై నిర్ణయం తీసుకోవాలి. రైతులకు ఇబ్బంది లేకుండా రెండు శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టడానికి ప్రయత్నం చేస్తున్నాం. నర్సరీల యజమానులకు సూచనలు చేస్తున్నాం. ఈ ఏడాది బొప్పాయి పంట ధరను నిలకడ చేసినట్లే విత్తనాలు, మొలకల ధరలు నిలకడగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం

- ఎం.వెంకటభాస్కర్, ఉద్యాన అధికారి

రాయచోటి
• రాయచోటి • పీలేరు

నేడు పీలేరు, రాయచోటిలో పీజీఆర్ఎస్

పీలేరు గ్రామీణ, రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి, పీలేరు ఆర్డీవో కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించనున్నామని ఆర్డీవోలు శ్రీనివాసులు, విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. రెండు డివిజన్ల పరిధిలోని మండలాల ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని వారు కోరారు.

పేదలకు వైద్యసేవలందించడమే లక్ష్యం

కంభంవారిపల్లి: గ్రామాల్లో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యమని శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అన్నారు. కుమ్మరపల్లెలోని వృద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు బ్రహ్మారెడ్డి, వైద్యులు జిలానీ, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి వరపడు పూజలు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: సంతాన ప్రదాతగా విలసిల్లుతున్న, చెర్లోపల్లెలో వెలిసిన రెడ్డెమ్మ దేవతకు ఆదివారం మహిళలు వరపడు పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, ప్రత్యేక భరణాలు, పుష్పాలతో చక్కగా అలంకరించారు. పుష్కరిణిలో స్నానమాచ రించిన మహిళలు తడివస్త్రాలతో వరపడి ఆపై తమ మొక్కులు తీర్చుకున్నారు. ఛైర్మన్ లంకిపల్లె రాజన్ననాయుడు, ఈవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ దేవత →





బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డిని సత్కరిస్తున్న మానవత సేవా సంస్థ ప్రతినిధులు

సమాజ శ్రేయస్సే లక్ష్యం

రాయచోటి, న్యూస్‌టుడే: సమాజ శ్రేయస్సు కోసమే మానవత సేవా సంస్థ పనిచేస్తోందని రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రమేష్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే సంస్థకు బాడీఫ్రీజర్ అందజేస్తామని చెప్పారు. అనంతరం దాతలను సంస్థ ప్రతినిధులు సత్కరించారు. కేంద్ర కమిటీ సభ్యులు శివగంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఆత్మీయ కమిటీ ఛైర్మన్ సి.వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు అంకం జయచంద్రారెడ్డి, కో-ఛైర్మన్ షకీల్, కార్యదర్శి పీరయ్య, ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

యువత.. బంగారు భవిత

✻ అందివచ్చిన ప్రోత్సాహం ✻ బాల సైనికులుగా విద్యార్థుల సేవలు

న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

ఎన్‌సీసీ అంటే దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ మెరుగవుతాయి.. పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎన్‌సీసీ శిక్షణ తీసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. . ప్రిన్సిపల్ వినీల ప్రోత్సాహం, లెఫ్టినెంట్ వెంకటరమణయ్య మార్గదర్శకత్వంలో ఎన్‌సీసీ కేడెట్లు జాతీయ స్థాయి శిక్షణ సదస్సులకు ఎంపికవుతున్నారు.. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో అవకాశాలు సద్వినియోగం చేసుకుంటామని చెబుతున్నారు.

గణతంత్ర పరేడ్‌కు ఎంపిక..



జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా దిల్లీలో ప్రధానమంత్రి పాల్గొనే పరేడ్ శిక్షణ సదస్సుకు ఎంపికవడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రస్తుతం కడపలో ఇదే మాక్‌డ్రిల్‌పై శిక్షణ తీసుకుంటున్నా. త్రివిధ దళాలతో సమానంగా ఈ పరేడ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఇలాంటి అవకాశం వస్తుందని అసలు ఊహించనే లేదు. ఈ పరేడ్‌లో పాల్గొనాలని ఎంతో ఉత్సాహంగా ఉన్నా. ఎప్పుడెప్పుడు జనవరి వస్తుందాని ఎదురుచూస్తున్నా. **-లోకేశ్**

సాహస యాత్రలకు వెళ్తా..



ఎత్తైన కొండలు ఎక్కడం, దిగటం, దట్టమైన అడవుల్లో కాలినడక, మంచు పర్వతాలు అధిరోహించడం ఇలా సాహస యాత్రలు చేయడానికి నిర్వహించే శిక్షణ సదస్సుకు ఎంపికయ్యా. ఆనందంగా ఉంది. ఇప్పటికే దీనికి సంబంధించి తిరుపతిలో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. వచ్చే నెల 15 నుంచి దేశ వ్యాప్తంగా వారు నిర్దేశించిన ప్రదేశంలో సాహస యాత్రలకు బయల్దేరతా. **- తేజ**

జాతీయ సమైక్యతకు బాటలు



ఇటీవల తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఏక్‌భారత్ శిక్షణ కార్యక్రమానికి ఎంపికయ్యా. శిక్షణ ముగించుకుని వచ్చా. ఇతర రాష్ట్రాల ఆచార సంప్రదాయాలు, ప్రజల మనోభావాలు తెలుసుకోవటం, ఏకత్వాన్ని కాపాడటం, జాతీయ సమైక్యతను పెంపొందించడం తదితర అంశాలపై శిక్షణలో నేర్చుకున్నా. **-మొబీనా**

థల్‌సైనిక్ శిక్షణకు వెళ్లా



అనంతపురంలో జరిగిన థల్ సైనిక్ శిక్షణకు ఎంపికై పూర్తి చేసుకుని వచ్చా. ఆర్మీతో సమానంగా ఉండే ఈ శిక్షణలో అత్యాధునిక ఏకే 47 ఆయుధాన్ని శత్రువులపై ఏవిధంగా ఉపయోగించాలో నేర్చారు. దిల్లీలో జరిగే ఆర్మీ శిబిరానికి ఎంపికవుతాననే నమ్మకం ఉంది. **-పూజ**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి : 9703622242
పీలేరు : 8008574958
చిన్నమండెం: 9440170752

న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ: సమస్య: టీబీ రోడ్డు మొదటి వీధిలోకి చెత్తబండి రావడం లేదు. కొత్తపేట అక్షర పాఠశాల సమీపంలో మురుగు నీటి కాలువ పూడిపోయింది. **- స్థానికులు**

సమాధానం: చెత్త తొలగించడం సహా కాలువ పూడిక తీయిస్తాం. -అశోక్, ఈవో, కలికిరి

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ: సమస్య: చెన్నముక్కపల్లె పంచాయతీలో సమయానికి కాలువలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వస్తోంది. **-రాజు, గ్రామస్థుడు**

సమాధానం: సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయిస్తాం. గ్రామస్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. **-పరిపూర్ణ అరుంధతి, ఎంపీడీవో**



రాయచోటి: పీటీఎంపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు



వాల్మీకిపురం: సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న పసుపు దండు

కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

రాయచోటి, న్యూస్‌టుడే: కూటమి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని పార్టీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ తెలిపారు. పట్టణంలోని పీటీఎంపల్లెలో ఆదివారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరిస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిలోకి తెచ్చి అభివృద్ధిని కొనసాగిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులదే విజయమని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను అర్హులందరికీ అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు మధుబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేదల సంక్షేమమే అజెండాగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని స్థానిక తెదేపా సీనియర్ మైనార్టీ నాయకులు సయ్యద్ అన్నారు. స్థానిక గంగమ్మగుడి వీధి, కుమార్‌నగర్ తదితర ప్రాంతాల్లో నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూనే పేదల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాయకులు అఫ్రోజ్, అష్రఫ్, జావెద్, వెంకట్రామయ్య, భాస్కర్, ధనూష్ పాల్గొన్నారు.

కలికమ్మ.. కొలికమ్మ.. వర్షం కురిపించండమ్మా

కలికిరి, న్యూస్‌టుడే: అమ్మా.. వర్షం కురిపించి.. కరవు నుంచి ఉపశమనం కల్పించమ్మా అంటూ కలికిరి మహిళలు స్థానిక పెద్దచెరువు పడమటి మొరవలో కొలువైన కలికమ్మ, కొలకమ్మకు జలాభిషేకం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కమ్ముకొస్తున్న కరవు నుంచి కాపాడటానికి వర్షాల కోసం ఆదివారం మహిళలు, గ్రామ పెద్దలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బిందె నీళ్లు, కొబ్బరికాయ, కర్పూరం తీసుకువచ్చారు. అంతకుముందు యల్లమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి చెరువు మొరవలో కలికమ్మ, కొలికమ్మకు జలాభిషేకం చేశారు.



జలాభిషేకం చేస్తున్న మహిళలు

వైభవంగా పంచామృతాభిషేకం


వాల్మీకిపురం, న్యూస్‌టుడే: స్థానిక ప్రాచీన శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి ఆలయంలో శ్రావణ ఆదివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. జలాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. మహిళలు పెద్దఎత్తున పిండిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్త మొగ్రంరెడ్డి రాంకుమార్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు జనార్దనస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



← విశేష అలంకరణలో నల్లవీర గంగాభవాని

బాగుపడేదెన్నడో..?

ఒంటిళ్లు నుంచి గురిగింజకుంట ఎస్సీ కాలనీ మీదుగా నాయునివారిపల్లె వరకు 1.5 కి.మీ రహదారిని అభివృద్ధి పనులు 2019లో ప్రారంభిచారు. రోడ్డుపై కంకర పోసి తారు వేయకుండా వదిలేశారు.



అప్పటి నుంచి దీన్ని పూర్తిగా గాలికి వదిలేయడంతో పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్తూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అసలు ఈ రోడ్డుకు మోక్షం కలిగేదెన్నడోనని వాపోతున్నారు.

-న్యూస్‌టుడే, సంబేపల్లె

బస్టాండు ఖాళీ.. రోడ్డుపైనే బస్సులు




గాలివీడు ఆర్టీసీ బస్టాండు ఆవరణలోకి బస్సులు రావడం లేదు. రాయచోటి, కదిరి డిపోలకు చెందిన బస్సులు నేరుగా వెళ్తున్నాయి. మదనపల్లె డిపో సర్వీసులు మాత్రమే వస్తున్నాయి. ఫలితంగా బస్టాండులో వేచిఉన్న ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆవరణలోకి బస్సులు అన్నీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గాలివీడు

ఇటుగా రాకపోకలు కష్టమే..!

సరిమడుగు పంచాయతీలో గుండ్లగుట్ట తండా నుంచి కలకడ రోడ్డుకు వెళ్లే మార్గంలో రహదారి అధ్వానంగా ఉంది. అడుగడుగునా గుంతలు పడ్డాయి. కంకర లేచిపోయి నడవడానికి ఇబ్బందిగా ఉంది.



వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు ఈ రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గుర్రంకొండ

మురుగు నిలిచి.. వ్యాధులు పెరిగి



మాసాపేట-వీరబల్లి రోడ్డులోని రెడ్డివారిపల్లెలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మొక్కలు పెరిగాయి. పలుచోట్ల మట్టితో నిండాయి. ఇళ్ల వద్ద, రోడ్డుకు ఆనుకుని ఉన్న కాలువలో నీరు ముందుకు వెళ్లని స్థితి. నెలలు గడుస్తున్నా శుభ్రం చేయకపోవడంతో పాచితో నీరు నిండి దోమలకు ఆవాసంగా మారింది. బ్యాక్టీరియా వృద్ధి చెంది వ్యాధులు ప్రబలితే ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది.

-న్యూస్‌టుడే, రాయచోటి పట్టణం

మాజీ సర్పంచి కుటుంబానికి పరామర్శ

గుర్రంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని తరిగొండ చెరువుమొరవపల్లెలోని మాజీ సర్పంచి లక్ష్మీదేవిని ఆదివారం మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆమె భర్త, సీనియర్ తెదేపా నేత ముత్తాన నారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్టీకి అందించిన సేవలను ఇరువురూ గుర్తుచేసుకున్నారు. అతడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు జగదీష్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మహాత్మరెడ్డి, మురళి, నేతలు చంద్రబాబు, నౌషాద్‌అలీ, శెట్టి, నరసింహులు, రెడ్డెన్న పాల్గొన్నారు.



నారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

గణేష్ లడ్డూ.. రూ.1.20 లక్షలు

పీలేరు, న్యూస్‌టుడే: ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో పీలేరు శివగణేష్ హోటల్ నిర్వాహకులు రూ.1.20 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. 120 కిలోల బరువు ఉండే ఈ లడ్డూను 30 కిలోల డ్రైఫ్రూట్స్, ఐదు కిలోల నెయ్యి, 80 కిలోల బూందీ, ఇతర సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా తయారు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. వినాయక ప్రతిమలు పెట్టినరోజే ఈ లడ్డూను వేలంలో దక్కించుకున్న వారు ఈశ్వరాలయం నుంచి ఊరేగింపుగా తెచ్చి తమ వినాయకుడి ప్రతిమ వద్ద ప్రజల దర్శనార్థం ఉంచుతారు. గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మోహన్‌రెడ్డి, వెంకటరమణ, కృపాల్‌బాబు, సుధాకర్‌బాబు, సుదర్శన్‌రెడ్డి, అమరేంద్రనాయక్, భాస్కరరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



వినాయకచవితి లడ్డూను దక్కించుకున్న శివగణేష్ కుటుంబీకులు



మలుపు.. తప్పదు ముప్పు

పీలేరు-మంచాలమంద బస్సు మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనాలు దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వస్తున్న వాహనం కనిపించనంతగా వంకరగా ఉండటంతో చోదకులు ఇబ్బందిగా వాహనాలు నడుపుతున్నారు. గ్రామీణ రోడ్డు కావడంతో అధికారులు మలుపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదు. కంభంవారిపల్లె మండలం అటవీ ప్రాంతంలో ఉన్న మంచాలమందకు పీలేరు మండలం మేళ్లచెరువు నుంచి ఐదు కిమీ దూరం మలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఆయా మలుపుల వద్ద చోదకులకు కనిపించేలా సూచికలు, వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పీలేరు**

నియంత్రికల చోరీ.. అవస్థల్లో అన్నదాతలు

సంబేపల్లె, న్యూస్‌టుడే: పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికలు చోరీకి గురవుతుండటంతో పంటలు తడారి రైతులు అవస్థలు పడుతున్నారు. అందులో ఉండే రాగి, అల్యూమినియం తీగలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండటంతో వీటిపై కన్నేశారు మండల పరిధిలోని సుద్దలవాండ్లపల్లె, ఆవులవాండ్లపల్లె సమీపంలోని పొలాల్లో 25 కేవీ నియంత్రికలు, గుట్టపల్లె, బుడ్డారెడ్డిగారిపల్లె వ్యవసాయ బోరు బావులకు ఏర్పాటు చేసిన రెండు 16 కేవీ నియంత్రికలను ధ్వంసం చేసిన దొంగలు.. లోహపు తీగలు చోరీ చేశారు. 25 కేవీ నియంత్రికల్లో 60 కిలోలు, 16 కేవీ నియంత్రికల్లో 40 కిలోల రాగి, అల్యూమినియం తీగలు ఉంటాయి. బహిరంగ మార్కెట్‌లో నాణ్యతను బట్టి ఇవి కిలో రూ.500 నుంచి రూ.వెయ్యి పలుకుతాయి. వ్యవసాయానికి పగటిపూట విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో రాత్రివేళ రైతులు అటువైపు వెళ్లే అవసరం ఉండదు. ఇదే అదనుగా దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఆయా చోరీలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.



రాగి తీగల కోసం ధ్వంసం చేసిన నియంత్రిక

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌పై గ్రామీణ మహిళల్లో వ్యక్తిగత అవగాహనతో పాటు అప్రమత్తత అవసరమని శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సంజీవని ఉమెన్ హెల్త్‌కేర్‌లో భాగంగా శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు, అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో ఆదివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్టు సభ్యులు శ్రీనివాసులురెడ్డితో కలిసి బ్రహ్మారెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 35 మంది మహిళలకు ఉచిత పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. 110 మంది మహిళలకు క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, తిరుపతి మెడిగో హాస్పిటల్ వైద్యులు షమీమ్, షబ్బీర్, జిలానీ, శ్రీనివాసులు, పఠాన్‌బాషా, గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు, న్యూస్‌టుడే: మండలంలోని బండ్లపల్లె గ్రామంలో ఆదివారం బోయకొండ గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజరెడ్డి దంపతులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎన్‌. రెడ్డెప్ప, పెద్దిరెడ్డి, వెంకటరెడ్డియాదవ్, అమరనాథరెడ్డి, చెంగారెడ్డి, అగస్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పంచలోహ విగ్రహాల అందజేత



విగ్రహాలు అందజేస్తున్న దాతలు

బి.కొత్తకోట,న్యూస్‌టుడే: బి.కొత్తకోట సీతారామాలయానికి రూ.2.85 లక్షల విలువైన పంచలోహ విగ్రహాలు దాతలు వితరణగా అందించారు. బెంగళూరులో నివాసముంటున్న బి.కొత్తకోట వాస్తవ్యులు మారెడ్డి ఆంజినేయరెడ్డి కుటుంబసభ్యులు ప్రత్యేకంగా తయారు చేయించిన సీతా, రామ, లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలను ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆదివారం అప్పగించారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న మానవతా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టినట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, హరినాథరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పింఛనర్ల భవన్‌లో సంస్థ నెలవారి సమావేశం సంస్థ ఛైర్మన్ నందీశ్వరయ్య ఆధ్యక్షతన నిర్వహించారు. సంస్థ సభ్యురాలు యోగా టీచర్ వనిత పట్టణంలో బస్సుషెల్టర్‌ను తన సొంత నిధులతో నిర్మిస్తామన్నారు. సభ్యులు హరినాథరెడ్డి, గణేష్, త్యాగరాజు, సుధాకర్ రావు, భక్తవత్సంరాజు, వెంకటముని, గంగులమ్మ తదితరులు పాల్గొన్నారు.


'రాయలసీమను కరవు ప్రాంతంగా ప్రకటించండి'

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రాయలసీమను కరవు ప్రాంతంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో సీపీఐ నాయకులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజాప్రతినిధుల అవినీతి అక్రమాలు పెరిగిపోతున్నాయని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు ప్రజాప్రతినిధులు స్వప్రయోజనాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలన్నారు. హంద్రీ- నీవా, గాలేరు- నగరి ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేసి సాగు, తాగునీరు అందించాలన్నారు. ఏపీ రైతుల సంఘం రాష్ట్ర నాయకులు జనార్దన్, మునిరత్నం, సీపీఐ చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శి శివారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, నియోజవర్గ నాయకులు మురళి, నరేశ్, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడిదొడుకుల నుంచి నేర్వరా పాఠాలు

పుంగనూరు, నిమ్మనపల్లె, సదుం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకే కాదు పాఠశాల ఆస్తులకు భద్రత కరవైంది. దీంతో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. కొన్నిచోట్ల విషసర్పాలు కూడా చేరుతున్నాయి. మరోవైపు పాఠశాలకు చెందిన కంప్యూటర్లు, ఇతర విలువైన సామగ్రికి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సగానికి పైగా పాఠశాలలకు ప్రహరీలు లేవని తేటతెల్లమైంది. నెర్రెలు బారిన, కూలిన గోడలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరముంది.

ముళ్ల పొదలు తొలగించాలి



పుంగనూరు పట్టణంలో 16 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈడిగపల్లె, వనమలదిన్నె ఉన్నత పాఠశాలలకు మినహా మిగతా వాటికి ప్రహరీలు ఉన్నాయి. 155 మంది విద్యార్థులు ఉన్న వనలమదిన్నె ఉన్నత పాఠశాలకు పూర్తిస్థాయిలో గోడ నిర్మించాల్సి ఉంది. పాఠశాల ఆవరణలో చుట్టూ ముళ్లపొదళ్లు, పిచ్చిమొక్కలు, చెత్త దిబ్బలను విధిగా తొలగించాలి. ఇరుకైన వంటగది, అసంపూర్తి భవనాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఒకవైపు మాత్రమే ప్రహరీ



నిమ్మనపల్లె మండలంలో నాలుగు జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా బాలినాయనపల్లె, రెడ్డివారిపల్లె ఉన్నత పాఠశాలలకు ప్రహరీ లేవు. నిమ్మనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు సైతం ఒకవైపే ప్రహరీ నిర్మించారు. మిగిలిన మూడు వైపుల నిర్మించలేదు. ● సదుం మండలంలో నాలుగు ఉన్నత పాఠశాలలు ఉండగా పాలమంద జడ్పీ ఉన్నత పాఠశాలకు ఇదే పరిస్థితి.

మూగజీవాల సంచారాలతో..



సోమల మండలం నంజంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 270మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ప్రహరీ నిర్మాణం చేపట్టినా స్థల వివాదంతో ముఖద్వారం వద్ద పనులు పూర్తి కాలేదు. అలాగే చౌడేపల్లె మండలంలోని కాటిపేరి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు చదువుకుంటుండగా వారి మధ్యనే పశువులు వెళ్తుండటం సహజంగా మారింది. పరికిదొన ఉన్నత పాఠశాల రహదారి పక్కనే ఉండడంతో వాహనాల రాకపోకలు, మూగజీవాల సంచారంతో విద్యార్థులకు భద్రత కరవైంది.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ దస్తగిరి

గొడవకు వెళ్లొద్దు.. అల్లరిపాలు కావద్దు

ములకలచెరువు, న్యూస్‌టుడే: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను గుర్తించుకుని ప్రజలు అల్లర్లకు పాల్పడకుండా అప్రమత్తంగా ఉండాలని ములకలచెరువు సీఐ దస్తగిరి అన్నారు. మండలంలోని మద్దినాయునిపల్లిలో జిల్లా ఏస్పీ ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత గొడవలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
మదనపల్లె పట్టణం: 80085 74611
పీలేరు గ్రామీణం: 80085 74958
పుంగనూరు: 80085 74622

సోమల, న్యూస్‌టుడే: ■ మండల కేంద్రమైన సోమల బస్టాండు ప్రాంతంలో, పీహెచ్‌సీ ముందున్న వీధిలో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు, సోమల**

✦ వీధి దీపాలు వెలిగేందుకు చర్యలు తీసుకుంటాం. **- చలపతి, పంచాయతీ కార్యదర్శి, సోమల**

పుంగనూరు, న్యూస్‌టుడే: ■ పురపాలక పరిధిలోని రాంనగర్, హనుమంతరాయదిన్నె కాలనీల్లో వీధిదీపాలు వెలగడం లేదు. **- రామయ్య, వనమలదిన్నె రోడ్డు, ఎన్‌ఎస్‌పేట**

✦ వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- రూపేష్, ఏఈ, పురపాలక, పుంగనూరు**



ఎమ్మెల్యే పార్థసారథికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

హక్కుల సాధనకు పోరాటం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: బీసీ, ఎస్సీ, ఎస్టీల చేతిలో రాజ్యాధికారం ఉన్నప్పుడే చట్టాలు చేయడం వారి హక్కులు సాధించుకోవడం సాధ్యమౌతుందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదివారం మదనపల్లెకు వచ్చిన ఆయనను వాల్మీకి జనసైనిక్, వాల్మీకి సాధన సమితి నాయకులు ఆహ్వానం మేరకు చిత్తూరు బస్టాండు కూడలిలోని వాల్మీకి విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం చెంబకూరు రోడ్డు రాగిమానువద్ద నిర్మాణంలో ఉన్న వాల్మీకి ఆలయాన్ని సందర్శించగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వాల్మీకులు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలుగా పిలువబడుతున్నారన్నారు. అయితే ఏపీలో మాత్రం విశాఖపట్నం, అరకు, విజయనగరం జిల్లాల్లో ఎస్టీలుగానూ, మైదాన ప్రాంతాలైన రాయలసీమలోని 8 జిల్లాల్లో వాల్మీకులు బీసీలుగానే ఉండటం దారుణమన్నారు. ఒక రాష్ట్రంలో ఒక కులం రెండుగా పిలవబడటం దేశంలో ఎక్కడా జరగలేదని అది ఏపీలో మాత్రమే జరిగిందన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, వాల్మీకి జనసైనిక్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు కృష్ణమూర్తి, బి.కృష్ణమూర్తి, చంద్రాయప్ప, సుధాకర్, వాల్మీకి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్‌షెల్టరు



పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పుంగమ్మ చెరువు కట్టపై గల కూడలిలో ప్రయాణికుల సౌకర్యార్థం దశాబ్దాల కిందట బస్‌షెల్టరు నిర్మించారు. నాటి నుంచి మరమ్మతులు చేయక నేడో, రేపో కూలడానికి సిద్ధంగా ఉంది. నిత్యం వందలాది మంది ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే ఈ బస్‌షెల్టరును పునర్నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఆదరించండి



కరపత్రాలు చూపుతున్న జాన్‌బాబు, తెదేపా మైనార్టీ సెల్ నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘం 131వ పోలింగ్ కేంద్రం పరిధిలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకుడు జాన్‌బాబు ఇంటింటికీ తెదేపా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వాన్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు జాతి గర్వించే నాయకుడు ఎన్టీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు తెలుగుజాతి గర్వించదగ్గ గొప్ప నాయకుడని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కొనియాడారు. మదనపల్లె మండలం పొన్నూటిపాళెం పంచాయతీ పరిధిలోని బంగారుపేట బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకొస్తున్న తెదేపా శ్రేణులను అభినందించారు. ఎన్టీఆర్ ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారని, ఆయన పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మండల తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం ఛైర్మన్ నవీన్‌చౌదరి, సిమెంటు రమణ, రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● బంగారుపేట బీసీ కాలనీలో ఆవిష్కరించిన ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు నివాళులు అర్పించారు. శేషాచలపతినాయుడు, అమర, మహబూబ్‌ఖాన్, ప్రభుగౌడ్, వరప్రసాద్, రెడ్డెప్ప, ఉమేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాక్స్ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

ఎస్సీలపై దాడులు అరికట్టాలని డిమాండ్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై కుట్రలు జరుగుతున్నాయని రాక్స్ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ అన్నారు. ఆదివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తున్నామన్నారు. గతంలో మాలమహానాడు కేవలం రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితమైందని అయితే ఎస్సీ వర్గీకరణ అంశం దేశవ్యాప్త సమస్యగా మారడంతో రాక్స్ మాలమహానాడుగా విస్తరించిందన్నారు. దేశంలోని దళిత ప్రాజాసామ్యవాదులు, సంఘ సంస్కర్తలు వర్గీకరణ కుట్రకు వ్యతిరేకంగా ఒక్కటై పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు భాస్కర్, నరేష్, రమణ, కనికెళ్ల నాని, ఎంపీ ఆనంద్, మోహన్, డీకే నారాయణ, వెంకటరమణ, లక్ష్మీపతితో పాటు పలువురు పాల్గొన్నారు.



వ్యర్థాలు ఇలా.. రాకపోకలెలా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రసిద్ధి చెందిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం నుంచి మడికయ్యల శివాలయానికి వెళ్లే మార్గం మధ్యలో బాహుదానది ఉంది. వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డుపై, బాహుదానదిలోనా పడేస్నున్నారు. భక్తులు వీటిని తొక్కుకుంటూ ఆలయానికి వెళ్లాలి. అధికారులు స్పందించాల్సి ఉంది.

నీటి తొట్టె.. పాచి పట్టె

రామసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని మాలేనత్తం గ్రామంలోని పశువుల తాగునీటి తొట్టె పాచి పట్టింది. నీటిపై పాచి తేలుతూ దర్శనమిస్తోంది. పదిహేను రోజులకొకసారి కూడా శుభ్రం చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇలాంటి నీటిని తాగితే పశువులు అనారోగ్యం బారిన పడే పరిస్థితి. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి పశువుల తాగునీటి తొట్టెను శుభ్రం చేయించాల్సిన అవసరం ఉంది.



7న ప్రమాణస్వీకారం..

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: తవలం శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ ప్రమాణస్వీకారోత్సవం వచ్చే నెల 7న జరుగుతుందని కొత్తగా నియమితులైన ఛైర్మన్ రెడ్డిమోహన్ తెలిపారు.

హత్య కేసుపై ముమ్మర దర్యాప్తు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మదనపల్లెలో భర్త చేతిలో హత్యకు గురైన దండామణి కేసు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. వివిధ కేసుల్లో నిందితుడిగా ఉండి బెంగళూరు జైలు నుంచి ఈనెల 14న విడుదలైన మధుకర్‌రెడ్డి తన భార్యను అత్యంత కిరాతకంగా కొడవలితో నరికి చంపిన విషయం తెలిసిందే. నిందితుడు పారిపోతూ తన బావమరిది వీరభద్రారెడ్డికి ఫోన్ చేసి మరో ఇద్దర్ని హత్య చేసి తాను కూడా చనిపోతానని చెప్పడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. మూడు బృందాలను ఏర్పాటు చేయడంతో పీలేరు, బెంగళూరు, ధర్మవరం ప్రాంతాలకు వెళ్లి అక్కడి స్టేషన్లలో నమోదు అయిన కేసుల వివరాలు సేకరిస్తున్నారు. అలాగే సాంకేతికత ఆధారంగా కూడా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దతిప్పసముద్రం మండలం కానగమాకులపల్లెకు చెందిన గణేష్ (30) ద్విచక్రవాహనంపై వెళ్తూ ఆదివారం ఉదయం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ● మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లెకు చెందిన నాగరాజు (48), ఆయన కుమార్తె సుశీల (19) ఆదివారం మదనపల్లె నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తట్టివారిపల్లె చెరువు కట్టపై ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో నాగరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. రూరల్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. ● బసినికొండకు చెందిన రెడ్డిప్రసాద్‌నాయక్ (38) ఆదివారం సొంతపనిపై పుంగనూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సుగాలి మిట్ట వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముగ్గురిపై దాడి.. కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ముగ్గురిపై దాడి కేసు నమోదు చేసినట్లు మదనపల్లె ఒకటో పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన సల్మా, ఆమె భర్త షౌకత్‌ఆలీపై ఇటీవల అల్లుడు గౌస్‌ఖాన్, ఆయన తల్లిదండ్రులు ఇస్మాయిల్‌ఖాన్, బీబీజాన్‌లు దాడి చేయడంతో మనస్తాపానికి గురైన సల్మ వాస్మల్ తాగి ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కబడ్డీ విజేతగా పోలీసు జట్టు

రామసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్.నడింపల్లె యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రెండ్రోజులుగా జరుగుతున్న కబడ్డీ పోటీల్లో బెంగళూరుకు చెందిన పోలీసు జట్టు విజేతగా నిలిచింది. రూ.25,000 నగదు బహుమతిని నిర్వాహకులు గోపాలకృష్ణ నుంచి అందుకున్నారు. యూత్ అసోషియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మధుసూదననాయుడిని సత్కరిస్తున్న తెదేపా నాయకులు

తెదేపా బలోపేతానికి కృషి

పుంగనూరు: నియోజకవర్గంలో అన్ని వర్గాల వారిని కలుపుకొని పార్టీని మరింత పటిష్ఠ పరచడమే తన లక్ష్యమని మధుసూదన్ నాయుడు అన్నారు. ఆదివారం బెంగళూరులోని తన నివాసంలో కలిసిన తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సత్కరించారు. నాయకులు మధుసూదనరాయల్, ద్రాక్షాయణిరెడ్డి, మోహన్‌నాయుడు, సుబ్రహ్మణ్యంరాజు, నాగరాజ, రాఘవరాయల్, శివ, దామోదరం తదితరులు పాల్గొన్నారు. **సోమల, న్యూస్‌టుడే:** పుంగనూరు నియోజకవర్గ తెదేపా బాధ్యుడిగా మధుసూదననాయుడు నియామకంపై ఆదివారం జిల్లా మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మధు శేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణసంచా పేల్చి స్వీట్స్ పంచి పెట్టి సంబరాలు జరిపారు. తొలుత పెద్దఉప్పరపల్లె బస్టాండులో ఉన్న ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు.. ఆదాయం బాగు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే

మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకుని తక్కువ పెట్టుబడులతో ప్రకృతి వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారు. వచ్చిన ఆదాయంతో కుటుంబపోషణ సాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. దీంతో పాటు పలువురికి సేంద్రియ ఎరువులు, కషాయం తయారీ చేయడంతో పాటు వాటిని విక్రయిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు పలువురు మహిళా రైతులు.

ఆరోగ్యానికి మేలు



ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నాను. మాకు ఎకరా వ్యవసాయ పొలంలో వంకాయ, బెండ, ఆరు రకాల ఆకుకూరలను పండిస్తున్నాము. సాగు చేసిన పంటలను మేమే సొంతంగా విక్రయిస్తున్నాం. ప్రతి సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో స్టాల్ పెట్టి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి అన్ని పంటలను విక్రయిస్తూ కుటుంబపోషణ సాగిస్తున్నాం. అంతే కాకుండా పలువురికి సేంద్రియ వ్యవసాయ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

- అమ్మాజీ, రైతు, దండువారిపల్లి, మదనపల్లె

సమాఖ్యలో రుణమే పెట్టుబడి



మొదటిసారి సంఘంలో రుణం తీసుకుని ఆవులు తీసుకున్నాను. ఎకరా వ్యవసాయ భూమి ఉంది. దీంతో పాటు ఇంకో ఎకరా కౌలుకు తీసుకొని నా భర్త భాస్కర్‌తో కలిసి వరి సాగు చేస్తున్నాం. వచ్చిన ఆదాయంతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నాం. అదే విధంగా విత్తనాలు కూడా తయారు చేసి విక్రయిస్తున్నాం. ఆదాయాన్ని పొదుపు చేసుకుని సొంతంగా ఇల్లు నిర్మించుకున్నాం. ఏడాదికి రూ.లక్ష ఆదాయం సమకూరుతుంది.

- రెడ్డిరాణి, రైతు, కొత్తపల్లి, మదనపల్లె

ఎరువులు, విత్తనాల తయారీతో..



మహిళా సంఘం ద్వారా తీసుకున్న రుణాలను వృథా చేయకుండా ఎకరా వ్యవసాయ భూమిలో 2014 నుంచి సేంద్రియ వ్యవసాయం సాగు చేయడం ప్రారంభించాను. ఇంటి వద్దే ప్రకృతి వ్యవసాయ వనరుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాను. వివిధ రకాలైన చేప బెల్లం ద్రావణం, కోడిగుడ్డు, నిమ్మ కషాయం, దశపర్ణి కషాయం, పంచగవ్య, జీవామృతం వంటివి తయారు చేసి విక్రయిస్తున్నాను. కిచెన్‌గార్డన్‌కు సంబంధించి విత్తనాలు తయారుచేసి విక్రయిస్తూ సీజన్‌లో నెలకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాను.

- వీరమ్మ, రైతు, టేకులపాళ్యం, మదనపల్లె